

సాక్షి ఒడిశా

సోమవారం, 25, డిసెంబర్, 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,08,562లు, బంగారం 10గ్రాము 350 మిల్లీగ్రాములు, వెండి 347 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



యేసయ్య రాకకై..!

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని యేసుక్రీస్తు రాక కోసం చర్చిలు సుందరంగా ముస్తాబయ్యాయి.

- 8లో



ముగిసిన గజపతి ఉత్సవాలు

స్థానిక గజపతి స్టేడియంలో వైభవంగా నిర్వహించిన గజపతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

- 8లో

న్యూస్‌రీల్

సెక్యూరిటీ గార్డుల ఆందోళనకు మద్దతు



సెక్యూరిటీ గార్డుల ధర్నాలో పాల్గొన్న పాత్రికేయులు

జయపురం: మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులు తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారు. దీంతో వీరికి మద్దతు తెలుపుతూ పాత్రికేయులు ఆదివారం ధర్నాలో కూర్చున్నారు. జల విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 81 మంది సెక్యూరిటీ గార్డులు శుక్రవారం నుంచి విధులు బహిష్కరించి ప్రాజెక్టు ప్రధాన ఇంజినీర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నారు. తమ డిమాండ్లను అంగీకరించకుంటే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

యాత్రికుడి హఠాన్మరణం



పరిడ మృతదేహం

రాయగడ: తీర్థయాత్రలు పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణమవుతున్న ఒక యాత్రికుడు స్థానిక రైల్వేస్టేషన్‌లో హఠాన్మరణానికి గురయ్యాడు. మృతుడు కొరాపుట్ జిల్లాలోని పూజారిపుట్ గ్రామానికి చెందిన రాజేంద్ర కుమార్ పరిడ(66)గా గుర్తించారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు తీర్థయాత్రల కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా రాయగడ నుంచి 960 మంది వృద్ధులను షిరిడీ, నాసిక్ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అందరితో కలిసి పరిడ తీర్థయాత్రలకు వెళ్లాడు. దర్శనం పూర్తి చేసుకొని ఆదివారం ఉదయం రాయగడకు చేరుకున్నారు. అంతా కలిసి ఆనందంగా రైల్వేస్టేషన్‌లో దిగి వెళ్తుండగా గుండె నొప్పితో ప్లాట్‌ఫారం వద్ద పడిపోయాడు. దీంతో అక్కడ ఉన్నవారు వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి ఆయన అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో యాత్రికుల్లో విషాదం నెలకొంది. అయితే యాత్ర కోసం ఈనెల 18వ తేదీన నవరంగపూర్ నుంచి వచ్చిన మరో కన్వీనర్ సైతం స్థానిక బిజూ కల్యాణ మండపం పై అంతస్తు నుంచి కాలు జారి కిందపడి మృతి చెందిన ఘటన తెలిసిందే. ఏదిఏమైనప్పటికీ ఈసారి తీర్థయాత్రలో ఇద్దరు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

సాయిప్రియ నగర్‌లో చోరీ



దుండగులు విరగ్గొట్టిన బీరువా



బాధితుడు నాయక్

రాయగడ: స్థానిక సాయిప్రియ నగర్ రెండో లైన్‌లో నివసిస్తున్న కార్తీక్ నాయక్ అనే వ్యక్తి ఇంట్లో శనివారం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం కార్తీక్ నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామానికి వెళ్లాడు. అయితే శనివారం రాత్రి తన ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని ఇరుగుపొరుగు వారు చెప్పడంతో వెంటనే రాయగడకు వచ్చిన బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటిలోకి చొరబడి దొంతనానికి పాల్పడ్డారు. ఇంట్లోని రెండు బీరువాలను విరగ్గొట్టి రూ.45 వేల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు మరో 20 తులాల వెండి వస్తువులను దొంగిలించుకుపోయినట్లు బాధితుడు నాయక్ సదరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మూల విరాటులకు మహాస్నానం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ్ ఆలయంలో రక్తం చిమ్మింది. ఆదివారం అంతరాలయం పరిసరాల్లో రక్తం చిమ్మినట్లు గుర్తించారు. ఆలయ ఆచారం ప్రకారం ఇటువంటి పరిస్థితుల్లో శుద్ధి తప్పనిసరి. అంతరాలయం శుద్ధిలో భాగంగా రత్న వేదికపై మూల విరాటులకు మహాస్నానం నిర్వహించారు. ఈ ప్రక్రియ ముగిసేంత వరకు భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేశారు. శ్రీమందిరం పరిపాలనా యంత్రాంగం ఈ విషయం తెలియజేసింది. వారాంతం, క్రిస్మస్ సెలవులు సందర్భంగా భక్తులు, యాత్రికులతో ఆలయం కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలో దర్శనం కోసం ఎగబాకిన పరిస్థితుల్లో ఒక భక్తుడు స్వల్పంగా గాయపడడంతో రక్తం చిమ్మినట్లు గమనించారు.

ఉర్రూతలూగించిన పథోత్సవం



విన్యాసాల ప్రదర్శన

నగరంలోని మాస్టర్ క్యాంటిన్ ఛక్ నుంచి రామ మందిరం కూడలి వరకు ఆదివారం ఉదయం నిర్వహించిన పథోత్సవం ప్రజలను ఉర్రూతలూగించింది. ఉదయం 9.30 గంటల వరకు ఈ మార్గం కిటకిటలాడింది. ఈసారి 3 వేర్వేరు వేదికలను ఏర్పాటు చేయగా క్రీడలు, సినీ నృత్య సంగీతం, స్కేటింగ్ పలు రకాల విన్యాసాలు ఆబాల గోపాలాన్ని ఆనందోత్సాహాలతో ముంచెత్తాయి. మంత్రులు సుదాం మరాండి, అశోక్ చంద్ర పండా, భువనేశ్వర్ (కేంద్ర) నియోజకవర్గం ఎమ్మెల్యే సుశాంత్ కుమార్ రౌత్, నగర మేయర్ సులోచన దాస్ తదితరులు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన వేదికపై బాలీవుడ్ నేపథ్య గాయని నిఖితా గాంధీ, రాపర్ బిగ్ డీల్, ప్రిన్స్ డాన్స్ గ్రూప్, ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

– భువనేశ్వర్



మ్యాజిక్ షో



బాలీవుడ్‌గాయని నిఖితా గాంధీ సంగీత ప్రదర్శన



ప్రిన్స్ డాన్స్ బృందం ప్రదర్శన



పథోత్సవం ప్రారంభ దృశ్యం

కొందమాల్‌లో హై అలెర్ట్



జి.ఉదయగిరిలో సీఆర్పీఎఫ్ జవాన్లు

బరంపురం: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని కొందమాల్ జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పాలన యంత్రాంగం ముందస్తు చర్యగా హై అలెర్ట్ ప్రకటించింది. జిల్లాలో 2007 డిసెంబర్ 25న స్వామీ లక్ష్మీనంద సరస్వతిపై హత్యా ప్రయత్నం జరిగింది. అనంతరం 2008 ఆగస్టు 21వ తేదీన హత్య జరిగింది. దీంతో అప్పట్లో జిల్లాలో హిందువులు, క్రైస్తవులకు మధ్య జరిగిన గొడవలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని టిక్కబల్లి, బ్రహ్మణిగ్రాం, బల్లిగుడా, జి.ఉదయగిరి, తుమ్మిడిబొందొ, రైకియా, కటింగియా బ్లాక్, పుల్బణి పట్టణంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దు గజపతి, గంజాం జిల్లా సరిహద్దుల్లో బలగాలు మోహరించాయి. ఇప్పటికే కలెక్టర్ బందా ఆదేశాలతో వివిధ గ్రామాల్లో జిల్లా పాలన యంత్రాంగం శాంతి కమిటీలు ఏర్పాటు చేసి, స్నేహపూర్వక వాతావరణం కల్పించేలా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.



పుల్బాణి పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం



జలస్‌పేట కన్యాశ్రమం వద్ద జవాన్ల నిఘా

23 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు

జయపురం: సదర్ పోలీసులు శనివారం రాత్రి 23 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి ఆదివారం తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి సదర్ ఎస్‌ఐ ఆర్.కె.బారిక్ పోలీసులతో కలిసి జయపురం– బొయిపరిగుడ రహదారి జయపురం సమితి బలియ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఒక ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువకులను ఆపి అనుమానంతో తనిఖీలు నిర్వహించగా గంజాయి బయటపడిందని వెల్లడించారు. గంజాయి సీజ్ చేసి ఇద్దరినీ అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టైనవారు నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ పోలీసుస్టేషన్ పరిధి బొడొకుమారి గ్రామానికి చెందిన హరేకృష్ణ మండల్ కుమారుడు సిద్ధార్థ మండల్(23), మహదేవ్ రాయ్ కుమారుడు గణేష్ రాయ్(32)లుగా నిర్ధారించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.30 లక్షలు ఉంటుందని వెల్లడించారు. వారి వద్దనున్న రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను సీజ్ చేశామని తెలిపారు. వీరు బొయిపరిగుడ సమితిలోని మారుమూల గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి రాంచీ తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.



పోలీసులకు పట్టుబడిన నిందితులు

ప్రేమే లక్ష్యం.. సేవే మార్గం

- జయపురంలో రాష్ట్రంలోనే అతి పురాతన చర్చి
- సమాజ సేవలో ముందడుగు
- సౌకర్యాల కల్పనకు పెద్దపీట

జయపురం: స్థానిక ఎవాంజిలికల్ లూథరిన్ చర్చి(జేఈఎల్‌సీ) సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తోంది. సుదీర్ఘ 142 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ చర్చి రాష్ట్రంలోనే అతి పురాతనమైనది. ఈ చర్చి బహుళ ఆదివాసీ అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో మొదటిసారిగా ప్రజలకు విద్య, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసింది. జయపురంలో 1882 మే 31వ తేదీన జర్మనీ స్కాలస్టిక్ హోల్‌స్టైన్ ఎవాంజిలికల్ లూథరిన్ మిషన్ సొసైటీ ఆధ్వర్యంలో పాస్టర్ రెహెర్మెన్ బోత్‌మన్ ఈ చర్చిని స్థాపించారు. ఈ చర్చి పరిధిలో ఒడిశాలోని అవిభక్త కొరాపుట్, ఆంధ్రప్రదేశ్‌లోని అరుకు ప్రాంతం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర జగదల్‌పూర్ జిల్లాలోని చర్చిలు అంతర్భాగాలుగా ఉంటాయి. జేఈఎల్‌సీలో దాదాపు 3 లక్షల మంది సభ్యులు ఉన్నారు.

19వ శతాబ్దంలో...

19వ శతాబ్దంలో జర్మనీ నుంచి మిషనరీలు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు చర్చిలు ఏర్పాటు చేసేందుకు అనేక ప్రయాసలు పడ్డారు. ఈ ప్రాంతంలో చర్చి పునాది వేయాలనే వారి ప్రయత్నానికి జగదల్‌పూర్‌లో ఆటంకం ఏర్పడింది. జగదల్‌పూర్‌లో చర్చి నిర్మాణానికి అప్పటి బస్తర్ రాజు నిరాకరించారు. దీంతో నిరాశ చెందిన మిషనరీ పెద్దలకు జయపురం మహారాజు మూడో విక్రమదేవ్ అనుమతి ఇవ్వడంతో జయపురంలో జేఈఎల్‌సీ ఏర్పడింది.

ఒక మహిళతో ప్రారంభం

చర్చిలో చేరిన మొదటి వ్యక్తి ఒక మహిళ కావడం గమనార్హం. జయపురంలో చర్చి ఏర్పాటైన తర్వాత కోట్‌పాడ్ పోలీసుస్టేషన్ పరిధి జోబా గ్రామానికి చెందిన అసుమతి బెహర 1886 డిసెంబర్ 6వ తేదీన బాప్టిజం పొందింది. ఈ చర్చిలో ఆమె మొదటి సభ్యురాలు. ఆమె చేరికతో ఉత్సాహం పొందిన క్రిస్టియన్లు జర్మనీ నుంచి 70 మంది మిషనరీలను తీసుకొచ్చి ఆదివాసీ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. 19వ శతాబ్దం నాటికి విద్య, వైద్య సౌకర్యాలు లేకపోవడంతో అవిభక్త కొరాపుట్‌లో విద్య, వైద్య సౌకర్యాల కల్పనలకు శ్రీకారం చుట్టారు. వాటిలో ప్రధానమైనవిగా నవరంగపూర్‌లోని జర్మనీ ఆస్పత్రిగా పేరుగాంచిన క్రిస్టియన్ ఆస్పత్రి, రాయగడ జిల్లా బిసంకటక్‌లోని క్రిస్టి హాస్పిటల్, బిసంకటక్‌లోని నర్సింగ్ కళాశాలలు పేరుగాంచాయి. ఈ ఆస్పత్రుల్లో ఆదివాసీ గ్రామీణ ప్రజలకు అధిక ప్రాధాన్యమిస్తూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే జయపురం, నవరంగపూర్, మల్కన్‌గిరి, కొరాపుట్, కోట్‌పాడ్‌లలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేసి ఉచిత విద్యనందిస్తున్నారు.



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమవుతున్న చర్చి స్వాగత ద్వారం



చర్చిని స్థాపించిన పాస్టర్ రెహిర్మెన్ బోత్‌మన్



జయపురం జేఈఎల్‌సీ చర్చి



నవరంగపూర్‌లోని జర్మనీ ఆస్పత్రి



జేఈఎల్‌సీ చర్చి

క్లుప్తంగా

ఇద్దరు జవాన్లకు గాయాలు

భువనేశ్వర్: ఐఈడీ పేలుడు సంఘటనలో ఇద్దరు ఎస్‌వోజీ జవాన్లు గాయపడ్డారు. మావోయిస్టులు ఈ పరికరం అమర్చినట్లు అనుమానిస్తున్నారు. ఆదివారం కందమాల్ జిల్లా తుముడిబొందొ పోలీసుస్టేషన్ పరిధి సిర్లా అటవీ ప్రాంతంలో ఈ సంఘటన సంభవించింది. కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఉదయం 10 గంటల ప్రాంతంలో పేలుడు సంభవించింది. ఇద్దరు జవాన్లకు గాయాలైనట్లు కందమాల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సువేందు పాత్రో తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే అనుమానంతో గత రెండు రోజులుగా ఆ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పరిమళ్ సర్కార్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోట్టేరు పంచాయతీ ఎంవీ 19 గ్రామ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి సమయంలో ఆగివున్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. మల్కన్‌గిరి నుంచి వస్తున్న పరిమళ్ సర్కార్(38) రోడ్డు పక్కనే ఇనుప రాడ్లుతో ఉన్నటువంటి లారీని ఢీకొన్నాడు. దీంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అటువైపు వెళ్తున్న మరో వాహనదారుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కలిమెల ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంతర పంటలతో అధిక లాభాలు

ఎచ్చెర్ల: మండలంలోని కుప్పిలి, అజ్జరాం, ఎస్ఎస్ఆర్‌పురం, ఎచ్చెర్ల వంటి వర్షాధార ప్రాంతాల్లో అంతర పంటలకు రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతర పంటల్లో భాగంగా ఒకో చోట పలు రకాల పంటలను వేయడం వల్ల ఒక పంట పోయినా మిగతా పంటలు పండటం వల్ల నష్టపోయే అవకాశం ఉండదని రైతులు అంటున్నారు. కొబ్బరి, ముల్లంగి, బెండ, మిరప, అరటి పంటలను ఒకే చోట వేసి పండిస్తున్నారు.

కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రం ఆకస్మిక తనిఖీ

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రాన్ని విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనకు గ్రీన్ మ్యాట్ పరిచి కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ముందు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో పలు అంశాలపై చర్చించారు. రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం రికార్డులను సైతం తనిఖీ చేశారు.

'వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అశిరినాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ అనుబంధ వీఓఏల సంఘం జిల్లా సమావేశం డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో డచ్ బిల్డింగ్ వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెలుగు సంస్థలో పని చేస్తున్న వీఓఏలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లోకో యాప్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు.

20 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్టు

కొత్తూరు: కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీకి చెందిన సవలాపురపు బాలరాజు మోటారు సైకిల్‌పై 20 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు. మెట్టూరు సెంటర్ వద్ద ఆదివారం అతడిని పట్టుకున్నామని, మోటారు సైకిల్ సీజ్ చేసి బాలరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

చీమలవలసలో కోతుల గుంపు

ఆమదాలవలస రూరల్: మండలంలోని చీమలవలస గ్రామంలో కోతులు స్వైర విహారం చేస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో వీధులు, ఇళ్ల, పొలాల్లో కోతులు గుంపులు, గుంపులుగా చేరి ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వీటి దాడిలో ఆదివారం బొడ్డేపల్లి అంజలి గాయపడ్దారు. ఈ సమస్య గురించి అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



భువనేశ్వర్: పూరీ సాగర తీరంలో ఉల్లిగడ్డలతో సుదర్శన్ పట్నాయక్ ఆవిష్కరించిన శాంటాక్లాజ్ భారీ సైకత శిల్పం



బరంపురం: గోపాల్‌పూర్ తీరంలో సత్య మహరణ తీర్చిదిద్దిన శాంటాక్లాజ్ సైకత శిల్పం



రాయగడ: మెయిన్ రోడ్డు వద్ద విద్యుత్ వెలుగుల్లో చర్చి

యేసయ్య రాకకై...!

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని యేసు క్రీస్తు రాకకోసం చర్చిలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఆదివారం పలుచోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు సైతం వైభవంగా జరుపుకున్నారు. చిన్నారులు పలు రకాల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. మార్కెట్‌లో సందడి వాతావరణం కనిపించింది. క్రిస్మస్ చెట్లు, శాంటాక్లాజ్ అమ్మకాలు జోరుగా సాగాయి. క్రైస్తవులు స్టార్‌లను తమ ఇళ్ల ముందు అలంకరించారు. - సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: పూరీ సాగర తీరంలో అంతర్జాతీయ శాండ్ యానిమేటర్ మానస కుమార్ సాహు తీర్చిదిద్దిన సైకత శిల్పం



రాయగడ: విద్యుత్ అలంకరణల్లో ఆర్‌సీఎం చర్చి



రాయగడ: క్రిస్మస్ చెట్టు



రాయగడ: యేసుక్రీస్తు జన్మ వృత్తాంతం తెలిపే అలంకరణ



రాయగడ: ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



పర్లాకిమిడి: మెడికల్ రోడ్డులో ఆర్‌సీఎం కాథలిక్ చర్చి




పర్లాకిమిడి: జీసస్ జన్మ చరిత్రను తెలియజేసే బొమ్మల నమూనా



పర్లాకిమిడి: దోలా ట్యాంకు రోడ్డులో పురాతన డబ్ల్యూఎంఈ చర్చి



రాయగడ: శాంటాక్లాజ్ బొమ్మ



రాయగడ: మేరీమాత విగ్రహం



వణికిస్తున్న చలిపులి

భువనేశ్వర్: రాష్ట్రమంతటా చలి వణికిస్తోంది. దాదాపు రోజంతా చలి వేస్తున్న వాతావరణం నెలకొంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతున్నాయి. పలు ప్రాంతాల్లో రాత్రిపూట నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే...

ప్రాంతం	కనిష్ఠ ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)		
		కెంజొహార్	8.8
		సుందరగడ్	9.0
కొరాపుట్	6.6	కిరెయి	9.4
దారింగిబాడి	7.0	ఫుల్బాణి	9.5
జి. ఉదయగిరి	7.4	సెమిలిగుడ	9.6

మంచుతో తగ్గిన దృశ్యమానత

భువనేశ్వర్: రాష్ట్రంలో వాతావరణం చలిగా మారడంతో ఉదయం పూట మంచు దట్టంగా కమ్ముతోంది. దీంతో రహదారులపై దృశ్యమానత తగ్గిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయం జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేసింది. మరో 2 రోజులపాటు ఈ వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ సమాచారం. పలు ప్రాంతాల్లో మంచు కమ్మడంతో దిగజారిన దృశ్యమానత వివరాలు.



ప్రాంతం	దృశ్యమానత పరిధి (మీటర్లు)
రౌర్కెలా	40
కొరాపుట్	50
రాయగడ	60
ఫుల్బాణి	70
బొలంగీరు	90
టిట్లాగడ్	100
భవానిపట్న	200

ముగిసిన గజపతి ఉత్సవాలు



జ్యోతి వెలిగిస్తున్న ఓర్మాస్ డైరెక్టర్ గుహాపూనం తపస్‌కుమార్



కూచిపూడి నృత్య ప్రదర్శన



స్టేడియంలో కిక్కిరిసిన జనాలు



మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర సాహు

స్థానిక గజపతి స్టేడియంలో వైభవంగా నిర్వహించిన గజపతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఉత్సవాలకు ఎంపీ చంద్రశేఖర సాహూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజపతి జిల్లాలోని అటవీ ఉత్పత్తులకు దేశవ్యాప్త మార్కెటింగ్ వ్యవస్థ ప్రారంభించాలని ఓర్మాస్ డైరెక్టర్ గుహాపూనం తపస్ కుమార్‌ను కోరారు. ఇప్పటికే కొన్ని వస్తువులను అమెజాన్ విక్రయిస్తోందని, భవిష్యత్‌లో మరికొన్ని మిషన్ శక్తి ఉత్పత్తుల అమ్మకాలు జరుపుతామని వెల్లడించారు. అనంతరం ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, సీఎస్ఐఆర్(ఎంఎంటీ) భువనేశ్వర్ డాక్టర్ రామానుజ్‌నారాయణ్, అదనపు ఎస్పీ సునీల్ మహంతి, ఓఎస్ఏపీ కమాండెంట్ అశోక్ కుమార్ మహంతి, విశ్రాంత తహసీల్దార్ పూర్ణచంద్ర మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు. - పర్లాకిమిడి

కేంద్రమంత్రి టుడు సుడిగాలి పర్యటన

కొరాపుట్: కేంద్ర గిరిజన శాఖ మంత్రి విశ్వేశ్వర టుడు నబరంగ్‌పూర్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం కొసాగుమ్మ సమితి బొడ అంబడ గ్రామ పంచాయతీ కేంద్రంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన మేలును వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలనే రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటోందని ఎద్దేవా చేశారు. అనంతరం చొర్పండ ఆశ్రమ పాఠశాలని సందర్శించారు. తదుపరి వంచలగుమ్మ గ్రామాన్ని సందర్శించి భారత వికాస్ యాత్రలో పాల్గొన్నారు. అలాగే తెంతులకుంటిలో సరస్వతి శిశు విద్యా మందిర్‌ని సందర్శించారు. అక్కడ విద్యా మందిర్ స్వర్ణోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆయనతో పాటు మాజీ ఎంపీ పరశురాం మఝి పాల్గొన్నారు.



భారత వికాస్ యాత్రలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి విశ్వేశ్వర టుడు

నైవేద్యం సమర్పణ



గౌడీయ మఠంలో 851 వంటకాలతో నైవేద్యం సమర్పించిన దృశ్యం

భువనేశ్వర్: పవిత్ర వ్యంజన ద్వాదశి పురస్కరించుకుని పూరీలోని గౌడ విహార్ లేదా మాతా మఠంలో ప్రత్యేక వంటకాలతో మఠ ఆరాధ్య దైవానికి నైవేద్యం సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా మార్గశిర శుక్ల ద్వాదశి రోజున వ్యంజన ద్వాదశిని వేడుకగా జరుపుకుంటున్నారు. ద్వాపర యుగంలోని జానపదాలు, సంప్రదాయాలను సజీవంగా ఉంచడానికి వ్యంజన ద్వాదశి భక్తి సంకల్పంతో జరుపుకుంటున్నట్లు మఠం వర్గాలు పేర్కొంటున్నాయి. ఏటా వ్యంజన ద్వాదశి తిథి రోజున ప్రత్యేకంగా గౌడీయ వైష్ణవులు ఈ వేడుక జరుపుకుంటారు. ద్వాపర యుగంలో తల్లి యశోద ఈ రోజున ప్రేమతో రుచికరమైన వ్యంజనాలు తయారు చేసి శ్రీకృష్ణునికి సమర్పించింది. ఈ సంప్రదాయం వైష్ణవ గౌడీయులు సంరక్షించే సంకల్పంతో ఈ వేడుక నిరవధికంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా రుచికరమైన వ్యంజనాలు తయారీ ప్రక్రియ పండుగకు ముందు నుంచే ప్రారంభమవుతుంది. గంజాం, గజపతి, పూరీ మరియు పశ్చిమ బెంగాల్‌లోని చాలా మంది భక్తులు రాధాదేవిని స్మరించుకుని అనేక వ్యంజనాలు సిద్ధం చేసి శ్రీ కృష్ణుడికి సమర్పిస్తారు. ఆ తర్వాత అందరూ కలిసి ప్రత్యేక విస్తరిలో నైవేద్యంగా సమర్పించిన పలు వంటకాలను వడ్డించుకుని ఆరగిస్తారు. ఈ ఆశ్రమంలో ప్రతీ సంవత్సరం 500 పైబడి పలు రకాల సాత్విక వ్యంజనాలు తయారు చేస్తారు.

సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యం



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- మాజీ మంత్రి జయరాం పంగి

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సమష్టిగా పనిచేస్తే కాంగ్రెస్ విజయం తథ్యమని మాజీ మంత్రి జయరాం పంగి అన్నారు. స్థానిక అశోక్ కల్యాణ మండపంలో మాజీ మంత్రి దివంగత రామచంద్ర ఉలక వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన తనయుడు కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాం పంగి మాట్లాడుతూ.. రామచంద్ర ఉలక ఆధ్వర్యంలో అవిభక్త కొరాపుట్ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా మారిందన్నారు. కానీ అనంతరం నాయకుల్లో సమన్వయం లోపించడంతో పరిస్థితులు ప్రస్తుతం మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికీ సమయం మించిపోలేదని త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేస్తే విజయం సాధించవచ్చన్నారు. పార్టీలోని సీనియర్ నాయకుల సూచనలు, సలహాలను తీసుకుని వారికి అనుగుణంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఏదిఏమైనప్పటికీ ఈసారి రాయగడ, కొరాపుట్ జిల్లాల్లో అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక వయస్సులో చిన్నవాడైనా రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిలా రాణిస్తుండడం అభినందనీయమన్నారు. మరోసారి ఆయన విజయానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గాప్రసాద్ పండ, డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగొ, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయరాం పంగి

క్లుప్తంగా

27న ఉద్యోగ మేళా

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఈ నెల 27న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్ మేళాకు హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా, ఎంఎస్ఎస్ ల్యాబ్స్, న్యూ ల్యాండ్ ల్యాబొరేటరీస్ సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు హాజరు కాదలచిన అభ్యర్థులు బీఫార్మా, బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత కలిగి కనీసం 26 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు ఆర్‌బీఎస్ఎస్ అండ్ ఎఫ్ఎస్‌దాస్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా విశాఖపట్నంలో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యోగావకాశాల్లో భాగంగా నెలకు రూ.12,500 నుంచి రూ.20,000 వరకు వేతనాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8688156216, 86880880562 నంబర్లకు సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న ఎస్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్

విజయనగరం టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జోన్ ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఎస్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో జోనల్ సర్వసభ్యసమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా ఉద్యమం చేస్తున్నప్పటికీ స్థానిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. కింద ఉన్న డీపీటీఓ ఆదేశాలివ్వలేని పరిస్థితులిలా కొనసాగితే తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని, రాష్ట్రవ్యాప్తంగా సర్క్యులర్ అమలు జరుగుతూ ఉంటే విజయనగరం జోన్‌లో అమలుపరచకపోవడం శోచనీయమన్నారు. ఈ హెచ్ఎస్ పాత ఆర్టీసీ పద్ధతిలో కొనసాగించాలని, సస్పెన్షన్ పేరిట ట్రాన్స్‌ఫర్ ఇచ్చిన వారిని జోన్ వ్యాప్తంగా తిరిగి సొంత డిపోలకు పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పీవీ.మోహన్, జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్ కుమార్, ఎంవీఆర్.మూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీజీ.రాఫెల్, బీఎస్.రాములు, జోన్‌లో ఉన్న అన్ని కేటగిరీల నాయకులు పాల్గొన్నారు.

చెరుకుతోటలో అగ్ని ప్రమాదం

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామంలో సాగులో ఉన్న 50 ఎకరాల చెరుకుతోటల్లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామస్తులు అందించిన సమాచారంతో అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు తోటను చుట్టుముట్టకుండా అదుపుచేశారు. దీంతో భారీ నష్టం నుంచి రైతులు బయట పడ్డారు. ఈ క్రమంలో ఆదే గ్రామానికి చెందిన సిరిపురపు సత్యనారాయణ, రామలింగం, నారాయణరావు, కృష్ణమూర్తి, కృష్ణతో పాటు ధనుకోటి వెంకరమణలకు చెందిన దాదాపు రెండు ఎకరాల చెరుకు తోట పూర్తిగా దగ్ధమైంది. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.

రైల్వే ట్రాక్ దాటిన గజరాజులు



కొమరాడ:రైల్వేట్రాక్ దాటుతున్న ఏడు గజరాజుల గుంపు

కొమరాడ: ఇటీవల దుగ్గి, కళ్లికోట, గుణానపురం పరిసరాల్లో సంచరించిన ఏడు ఏనుగుల గుంపు ఆదివారం రైల్వే ట్రాక్ దాటి ఆర్తాం కొండ పరిసరాల్లోకి చేరుకుంది. కుమ్మరిగుంట, స్వామినాయుడువలస పంట పొలాల్లో సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమాటా, జొన్న, అరటి, తదితర పంటలను నాశనం చేస్తున్నాయని చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల గుంపును తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

రేగిడి చేరిన మరో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తివ్వాకొండ పరిసరాల్లోకి కొత్తగా ఏనుగుల గుంపు చేరింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సంచరించే గజరాజులు తిత్తిరి రూటులో రేగిడికి చేరాయి. ఇప్పటికే వరి కోతలు పూర్తికావడంతో ఆహారం దొరకక ఆదివాసీలు సాగు చేస్తున్న అరటి, కూరగాయల తోటలను నాశనం చేస్తున్నాయని నల్లరాయిగూడ సర్పంచ్ గోయింతి ప్రసాద్, బిడ్డికి నూకయ్య ఆందోళన వ్యక్తం చేశారు.

మార్కెట్‌కు మన్యం కంది



- జిల్లాలో 415 ఎకరాల్లో సాగు
- ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి
- ఆర్గానిక్ పద్ధతిలో సాగు
- విక్రయానికి సిద్ధమవుతున్న గిరిజన రైతాంగం

కందిపంట సాగు విస్తీర్ణం ఇలా...

మండలం	ఎకరాలు
సీతంపేట	23.43
జి.ఎల్.పురం	125.92
కురుపాం	269.2
పాలకొండ	17.72
భామిని	1.26
వీరఘట్టం	10.67
సాలూరు	3.9
పాచిపెంట	0.19
మక్కువ	7.89
కొమరాడ	35.02

సీతంపేట: మన్యంలో ఈ ఏడాది కందిసాగు గిరిజన రైతులకు కలిసొచ్చింది. అధికదిగుబడి వస్తుండడంతో ఆనందపడుతున్నారు. గతేడాది అకాల వర్షాలతో పంటకు నష్టంవాటిల్లింది. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించడంతో పంట కలిసొచ్చిందని రైతులు చెబుతున్నారు. కొందికొత్తల పండగ పూర్తయిన గ్రామాల్లో పంట విక్రయాలు ప్రారంభించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాలకు 10 మండలాల్లో 415 ఎకరాల్లో కందిపంట సాగులో ఉంది. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు దిగుబడివస్తోంది. ఎకరా కంది పంట వేసే రైతుకు ఖర్చులుపోను రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ఆదాయం సమకూరుతుందని రైతులు చెబుతున్నారు. మన్యంలో జీడి, పసుపు వంటి పంట పొలాల్లో అంతర పంటగా కందిని సాగు చేస్తారు. కొన్నిచోట్ల పోడుభూముల్లో ప్రధాన పంటగా కూడా సాగుచేస్తున్నారు. గిరిజన రైతులకు ఐటీడీఏలు నాణ్యమైన విత్తనాలను సమకూర్చుతున్నాయి. మార్కెట్‌లో కంది పంటకు గిరాకీ ఉండడం రైతులకు కలిసొస్తోంది. గిరిజనుల వద్దనే నాణ్యతను బట్టి కిలో కందులు రూ.65 నుంచి రూ.80 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

పితృదేవతలకు పూజించాకే..

ఈ నెలాఖరు నుంచి జనవరి మొదటి వారం వరకు పంట చేతికందుతుంది. గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం కందికొత్తల పండగ చేస్తారు. కొండపోడులో సాగుచేసే కందిపంటను కందికొత్తల పండగ తరువాత మాత్రమే తింటారు. విక్రయిస్తారు. ముందుగా పితృదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. గిరిజనులు దేవతలుగా భావించే చేతరమ్మ, గొడ్డలమ్మ, కప్పరమ్మను జాకరమ్మదగ్గరకు చేర్చుతారు. గిరిజనలందరూ అక్కడికి చేరి పూజలు చేస్తారు. కొత్తగా చేతికందిన కందిపంటతో వంటకాలు చేసి గిరిజన దేవతలకు నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం సామూహిక భోజనాలు చేస్తారు.



కందికాయలు

దిగుబడి పెరిగింది



ఈ సంవత్సరం కంది దిగుబడి పెరిగింది. కొంతమంది రైతులు పొలాలతో పాటు గట్లపైన పంటను సాగుచేశారు. వీటి దిగుబడి గతేడాది కంటే బాగుంది. ఐటీడీఏ పరంగా గిరిజనులుకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ సాగును ప్రోత్సహిస్తున్నాం. అవసరమైన చోట అవగాహన సదస్సులు పెడుతున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– జి.హరికృష్ణ, ప్రాజెక్టు అగ్రికల్చరల్ ఆఫీసర్, ఐటీడీఏ, సీతంపేట

కొండపోడులో సాగు చేస్తాం



ఎక్కువగా కొండపోడు వ్యవసాయంలో కూడా కంది పంటను సాగు చేస్తాం. ఎత్తైన కొండలపై కూడా కంది వేస్తాం. అలాగే, దిగువ పొలాల్లో గట్లపైన పంట పండిస్తాం. కంది పంటకు ధర బాగుంది. అధిక ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాం.

– ఎస్.రజిని, కోసిమానుగూడ



పొలం గట్లపై కంది పంట

ఉల్లాసంగా జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

- స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టారుకు ఘనంగా నివాళి

విజయనగరం: కబడ్డీ, ఖోఖో పితామహుడు స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టారు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి బాలుర ఖోఖో పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. భగవాన్‌దాస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 జట్లు పాల్గొన్నాయి. పోటీల ప్రారంభోత్సవానికి ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహానికి ట్రస్ట్ కార్యదర్శి రంగారావు దొర, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, వ్యాయామ అధ్యాపకుడు ఏఎస్ఎం కమలనాభరావు, రిటైర్డ్ కోచ్ రమణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో మరుపల్లి జట్టు ప్రథమస్థానం దక్కించుకోగా..కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల జట్టు ద్వితీయ స్థానం కై వసం చేసుకుంది. తృతీయ స్థానాన్ని ఉమ్మడిగా గరుగుబిల్లి, తోండ్రంగి జట్లు దక్కించుకున్నాయి. పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్, కేపీ బాలకృష్ణ, పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

జాషువాపై చారిత్రక దృష్టితో పరిశోధన



డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్‌కిరణ్‌ను సత్కరిస్తున్న విజయభావన సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: జాషువాపై చారిత్రక దృష్టితో పరిశోధన జరగాలని శ్రీకాకుళం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రాత్రి జాషువా కవితా వైభవంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాషువా గబ్బిలం-ఆంధ్ర చారిత్రక వైభవం అనే విషయంపై మాట్లాడుతూ తనను తాను విశ్వనరుడిగా ప్రకటించుకున్నా, కొందరు మాత్రం సంఘసంస్కరణకు, దళితవాదానికి, దేశభక్తికి మాత్రమే పరిమితం చేశారన్నారు. నేతాజీ-బాపూజీ, గబ్బిలం -క్రీస్తు ఇలా విభిన్న తత్వాలు కలగలిపిన రచనలు ఆయనను విశ్వనరునిగా చూపిస్తాయన్నారు. గబ్బిలం రచనలో హంపి, కవిత్రయం, కొండవీటిరాజులు తదితర చారిత్రక అంశాలు సోదాహరణంగా చూపించారని కొనియాడారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు స్వాగతం పలకగా, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. అనంతరం సమాఖ్య గౌరవ సలహాదారు బీహెచ్‌కే.బాబూజీ సమ్మానకర్తగా వ్యవహరించారు. మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల విద్యార్థులు కోట విజయకుమార్, పెంకి సాయితేజలు కవితాగానం చేశారు. కార్యక్రమంలో మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల అధ్యక్షుడు డాక్టర్ జి.జనార్ద నాయుడు, సభ్యులు భోగరాజు సూర్యలక్ష్మి, బాబూరావు, రాఘవరావు, వారణాసి మూర్తి, గురునాథరావు, సర్వేశ్వరరావు, సోమేశ్వరరావు, హరిచందన్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

టీబీపై టీకా అస్త్రం

- గ్రామాల్లో మొదలైన సర్వే



బీసీజీ వ్యాక్సిన్



గంట్యాడ మండలం పెదవేమలిలో సర్వే చేస్తున్న ఏఎన్ఎం

విజయనగరం ఫోర్ట్: ఒకరి నుంచి మరొకరికి అతిత్వరగా వ్యాప్తి చెందే వ్యాధి క్షయ (టీబీ). క్షయ రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, పొగ తాగేవారికి ఎక్కువగా క్షయ వ్యాధి సోకే ఆస్కారం ఉంది. అదేవిధంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా క్షయ వ్యాధి సోకే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం క్షయ వ్యాధి బారిన పడే వారి సంఖ్యను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. టీకా అస్త్రాన్ని ఉపయోగించి క్షయ వ్యాధికి చెక్ పెట్టనుంది.

సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

క్షయ వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు ఈనెల 13 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయడానికి అర్హత ఉన్న వారి వివరాలు ఏఎన్ఎం యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బరువు తక్కువగా ఉన్న వారిని సర్వేలో గుర్తిస్తున్నారు.

సర్వే పూర్తయిన వెంటనే టీకా



ఆన్‌లైన్ సర్వే పూర్తయిన వెంటనే బీసీజీ టీకా వేయడం ప్రారంభిస్తాం. రెండు రోజులుగా సిబ్బంది సర్వే చేస్తున్నారు. టీకా వేయడం వల్ల క్షయ వ్యాధి బారిన పడే వారిని 18 నుంచి 21 శాతం తగ్గించవచ్చు.

– డాక్టర్ కె.రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి

ప్రతి ఇంటా సంతోషం నిండాలి

- కలెక్టర్ నాగలక్ష్మి
- జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: ఈ క్రిస్మస్ పండగ ప్రజలందరి జీవితాల్లో సంతోషం నింపాలని, ప్రతి ఇంటా ఆనందపు కాంతుల వెలుగులు నిండాలని కలెక్టర్ నాగలక్ష్మి అకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ ఆదివారం ఆమె ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సాటి మానవుల పట్ల ప్రేమ, దయ, కరుణ, క్షమాగుణం చూపడం అనే ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని పేర్కొన్నారు. ఈలోకానికి మార్గదర్శి అయిన ఏసు ప్రభువు జన్మించిన ఈక్రిస్మస్ పర్వదినం అందరిలో నూతన ఉత్సాహాన్ని నింపాలని, ఆయురారోగ్యాలు సిద్ధించాలని అకాంక్షించారు. శాంతి, సౌఖ్యాలు వర్ధిల్లాలని, ప్రజలంతా సోదర భావంతో మెలగాలని కోరుకున్నారు.

స్కూటీ అదుపుతప్పి యువతి మృతి

- మృతురాలి నేత్రాలు సేకరించిన రెడ్‌క్రాస్



నేత్రాలను సేకరిస్తున్న టెక్నీషియన్ శ్రీను



నందిని (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: స్థానిక సీతం కాలేజీలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న యువతి స్కూటీ అదుపుతప్పి కింద పడిపోయి మృతిచెందింది. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గాజులరేగకు చెందిన బోనెల నందిని(18) శనివారం స్కూటీపై కాలేజీ నుంచి ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలైంది. దీంతో కుటుంబసభ్యులు నందినిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను తీసుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డోనేషన్ సెంటర్ సిబ్బందికి తెలియజేయడంతో టెక్నీషియన్ ఎ.శ్రీను కార్నియాలను సేకరించారు. తన కూతురు చనిపోయినా ఆమె కళ్లతో మరో ఇద్దరికి చూపును ప్రసాదించాలన్న ఉద్దేశంతో ఆమె నేత్రాలను సేకరించాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డొనేషన్ సెంటర్‌కు సమాచారం ఇచ్చామని మృతురాలి తండ్రి పైడిరాజు తెలిపారు.

ఆటల పండగపై అవగాహన

- సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్
- జిల్లావ్యాప్తంగా 5 క్రీడాంశాల్లో 1.38 లక్షల మంది పేర్ల నమోదు
- ఆడుదాం ఆంధ్రాపై జిల్లాకేంద్రంలో ఉత్సాహంగా 2కె రన్



రాజీవ్ క్రీడామైదానంలో జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభిస్తున్న సెట్విజ్ సీఈఓ రామగోపాల్, డీఎస్‌డీఓ అచ్యుతరావు

విజయనగరం: క్రీడల్లో ప్రతిభ గల వారిని గుర్తించి ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ తెలిపారు. పోటీల నిర్వహణపై అన్ని వర్గాల ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుత్‌కుమార్ ఆధ్వర్యంలో 2 కెరన్‌ను ఆదివారం నిర్వహించారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం నుంచి ప్రారంభమైన రన్ కోట జంక్షన్ మీదుగా మళ్లీ రాజీవ్ క్రీడామైదానానికి చేరుకుంది. క్రీడాకారులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. అనంతరం రన్‌లో విజేతలుగా నిలిచిన వారికి సెట్విజ్ సీఈఓ, డీఎస్‌డీఓలు బహుమతులు ప్రదానం చేశారు.

ఐదు అంశాల్లో పోటీలు

ఈ సందర్భంగా సీఈఓ రామగోపాల్ మాట్లాడుతూ 15 సంవత్సరాలకు పైబడి వయస్సుండి క్రీడా ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. మొత్తం 5 అంశాల్లో నిర్వహించతలపెట్టిన పోటీల్లో ఇప్పటి వరకు విజయనగరం జిల్లాలో 1.38 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు సమీపంలోని సచివాలయంలో, 1902 నంబర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాలతో పాటు యోగా, టెన్నికాయిట్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలను ఈనెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిలో ప్రారంభించనుండగా.. విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారన్నారు. ఆ రోజు నుంచి సచివాలయ స్థాయిలో పోటీల నిర్వహణకు సంబందించి అవసరమైన మైదానాలు గుర్తించామని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన క్రీడాసామాగ్రి ఇప్పటికే పంపిణీ చేసినట్లు చెప్పారు.

విజేతలకు నగదు ప్రోత్సాహకం

సచివాలయం, మండల స్థాయి పోటీల్లో విజేతలు నియోజకవర్గ స్థాయికి అర్హత సాధిస్తారని, నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ట్రోఫీలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాళ్ల సూరిబాబు, వివిధ క్రీడాంశాలకు చెందిన కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడాప్రతిభను వెలికితీసేందుకే..

ఆడుదాం ఆంధ్రా పోటీలు



ఆడుదాం-ఆంధ్రా క్రీడా సంబరం అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

పార్వతీపురంటౌన్: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఆడుదాం-ఆంధ్రా పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆర్‌సీఎం స్కూల్ వరకు ఆదివారం నిర్వహించిన ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల అవగాహన ర్యాలీని జేసీ ప్రారంభించారు. క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజుల పాటు సాగే క్రీడాసంబరం క్రీడల్లో రాణించేందుకు చక్కని వేదికగా పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో తలపడి క్రీడాప్రతిభను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత ఎస్.జయరాం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహనరావు, మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, ఎంఈఓ ప్రసాదరావు, వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు వరప్రసాద్, సీహెచ్ రత్నాకర్, సి.శ్రీనివాసరావు, శ్రీధర్, క్రీడా శిక్షకులు గణేష్, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడాకారులతో జేసీ కాసేపు కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు.



విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న జాయింట్ కలెక్టర్